నమస్తే తెలంగాణ
# జగిత్యాల
5 కరీంనగర్, సోమవారం 18 మార్చి 2024 JAGTIAL

# కాంగ్రెస్‌వి 420 హామీలు


మంథనిలో మాట్లాడుతున్న కొప్పుల ఈశ్వర్ పక్కన జడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్

- ఆచరణ సాధ్యంకాని వాగ్దానాలతో గద్దెనెక్కింది
- చేతకాని పాలనతో రాష్ట్రం పదేండ్లు వెనక్కిపోయింది
- ఓట్లప్పుడు మాత్రమే వచ్చే టూరిస్టు నాయకులు కావాలా..? ప్రజల మధ్య ఉండే నాయకుడు కావాలా..? ఆలోచించుకోండి
- మీ బిడ్డగా ఎంపీ అభ్యర్థిగా బరిలో ఉంటున్న.. ఆశీర్వదించండి
- పెద్దపల్లి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్

మంథని/కమాన్‌పూర్/రామగిరి/ముత్తారం, మార్చి 17 : గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రజలను మభ్యపెట్టిందని, 420 హామీలు ఇచ్చి మోసం చేసిందని పెద్దపల్లి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ విమర్శించారు. ఆచరణకు సాధ్యం కాని హామీలతో గద్దెనెక్కిందని, చేతకాని పాలనతో రాష్ట్రం పదేండ్లు వెనక్కిపోయిందని దుయ్యబట్టారు. మంథనిలోని రాజగృహ, కమాన్‌పూర్‌లోని మాజీ ఎంపీపీ ఇనుగంటి ప్రేమలత నివాసంలో, సెంటినరీకాలనీలోని మినీ బ్లాంకెట్ హాల్‌లో, ముత్తారంలోని శ్రీ సరస్వతీ విద్యాలయంలో ఆదివారం వేర్వేరుగా ముఖ్య కార్యకర్తల సమావేశాలు నిర్వహించారు. ఆయా చోట్ల మాట్లాడారు. 100 రోజులు పూర్తవుతున్నా ఇచ్చిన హామీలను మాత్రం కాంగ్రెస్ అమలు చేయలేదని ఎద్దేవా చేశారు. కేసీఆర్ సారథ్యంలో బీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుతో వ్యవసాయాన్ని పండుగలా మార్చిందని కొనియాడారు. రైతులు, సబ్బండవర్గాల కోసం ఎన్నో అద్భుత పథకాలు ప్రవేశ పెట్టి వంద శాతం అర్హులకు చేరేలా కృషి చేసిన గొప్ప వ్యక్తి కేసీఆర్ అని కీర్తించారు. కానీ మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రజల సంక్షేమాన్ని, అభివృద్ధిని పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. కేవలం కాళేశ్వరం ప్రాజెక్టు, కేసీఆర్ గురించి మాట్లాడడం తప్ప అభివృద్ధి చేయాలనే ఆలోచన వారికి రావడం లేదన్నారు. వరదలతో కాళేశ్వరం ప్రాజెక్టులో కేవలం ఒక్క పిల్లర్ కుంగి పోతే మొత్తం ప్రాజెక్టు కూలిపోయినట్లుగా తప్పుడు ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో పుష్కలమైన సాగునీళ్లతో కళకళలాడిన పొలాలు నేడు ఎండిపోతున్నాయని, కరెంట్ కోతలు మొదలయ్యాయని చెప్పారు. సాగునీటి కోసం రైతులు రోడ్డెక్కి నిరసన చేస్తున్నా, హామీల అమలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నా పట్టించుకునే నాథుడే లేరని దుయ్యబట్టారు. ఈ విషయాన్ని ప్రజలు గమనిస్తున్నారని, వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు తగిన గుణపాఠం చెప్పడం ఖాయమన్నారు. 30 ఏళ్ల తన రాజకీయ జీవితంలో ఎలాంటి మచ్చ లేకుండా జీవించానని, ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం మంత్రిగా, విప్‌గా, ఎమ్మెల్యేగా అహర్నిశలు కృషి చేశానని, ఇప్పుడు మీ బిడ్డగా ఎంపీ అభ్యర్థిగా బరిలో నిలుస్తున్నానని ఆశీర్వదించాలని కోరారు. ఈ ఎంపీ ఎన్నికల్లో మాటలతో మభ్యపెట్టే కోట్లకు అధిపతులైన టూరిస్టు నాయకుడు కావాలా..? లేక నిత్యం మీతోనే ఉండి సేవలందించే తాను కావాలో ప్రజలే ఆలోచించుకోవాలని పిలుపునిచ్చారు.

### రూ.2లక్షల రుణమాఫీ ఏమైంది: జడ్పీ చైర్మన్ మధూకర్

'కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లోనే రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేస్తానని ఎన్నికల ముందు సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. మరి ఏమైందో..? చెప్పాలి.?, ఆయన చెప్పిన ప్రకారం జనవరి, ఫిబ్రవరిలోనే చేయాలి. కానీ అధికారంలోకి వచ్చి 100 రోజులు గడుస్తున్నా ఎందుకు చేయలేదో చెప్పాలి' అని జడ్పీ చైర్మన్ మధూకర్ ప్రశ్నించారు. ఆరు గ్యారెంటీలు అమలు చేస్తున్నామని ప్రకటనలు ఇస్తున్నారే గానీ..? ఆచరణలో మాత్రం చూపించడం లేదని మండిపడ్డారు. ప్రభుత్వం దగ్గర డబ్బులు లేవని, ఖజానా ఖాళీగా ఉందని చెప్పే సీఎం రేవంత్‌రెడ్డికి ఆరు గ్యారెంటీలపై పేపర్ ప్రకటనల కోసం డబ్బులు ఎక్కడి నుంచి వస్తున్నాయో..? చెప్పాలని ప్రశ్నించారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ గెలుపే లక్ష్యంగా పనిచేద్దామని శ్రేణులకు పిలుపునిచ్చారు. వేర్వేరుగా జరిగిన ఈ కార్యక్రమాల్లో బీఆర్ఎస్ మండలాధ్యక్షులు ఎగోలపు శంకర్‌గౌడ్, పిన్‌రెడ్డి కిషన్‌రెడ్డి, రవీందర్, పోతుపెద్ది కిషన్‌రెడ్డి, మంథని, రామగిరి జడ్పీటీసీలు తగరం సుమలత, శారద, ముత్తారం ఎంపీపీ ముత్తయ్య, రామగిరి, ముత్తారం వైస్ ఎంపీపీలు ఉప్పరి శ్రీనివాస్ యాదవ్, సుధాటి రవీందర్‌రావు, నాయకులు తగరం శంకర్‌లాల్, పూదరి సత్యనారాయణగౌడ్, పెగడ శ్రీనివాస్, ప్రసాద్, రొడ్డ శ్రీనివాస్, నాగెల్లి సాంబయ్య, కుమార్‌యాదవ్, కాపురబోయిన భాస్కర్, బుర్ర శంకర్ గౌడ్, గాజుల ప్రసాద్, బడికెలా శ్రీనివాస్, ఉదరి సదానందం, రాచకొండ లక్ష్మణ్, పిడుగు సతీష్, ఇనగంటి రామారావు, పిట్ల గోపాల్, మేకల సంపత్ యాదవ్, కొట్టే భూమయ్య, మహిళా విభాగం మండలాధ్యక్షురాలు పొన్నం రాజేశ్వరీ, ఎంపీటీసీలు కోలేటి చంద్రశేఖర్, గుడిసెల ఉమా సంపత్, నీలం సరిత శ్రీనివాస్, గుజ్జుల రాజిరెడ్డి, జంజర్ల శేఖర్, సెగ్గెం రాజేష్, ప్రసాద్, తొంబూరపు తిరుపతి, మాచీడి రాజుగౌడ్, ముత్యాల లింగయ్య, కనవేన శ్రీనివాస్, అత్తె చంద్రమౌళి, నూనె కుమార్, రమణారెడ్డి, పప్పు స్వరూప, చంద్రమౌళి పాల్గొన్నారు.


హాజరైన నాయకులు, కార్యకర్తలు

# సాగునీళ్లు మహాప్రభో


ఎండిపోయిన చిల్వాకోడూర్ వాగు

- గొల్లపల్లి మండలంలో సాగునీటి కటకట
- చిల్వకోడూర్, దట్నూర్, అబ్బాపూర్‌లో ఎండుతున్న పంటలు
- ప్రశ్నార్థకంగా 400 ఎకరాలు
- పట్టించుకోని కాంగ్రెస్ ప్రభుత్వం
- నీటిని విడుదల చేయాలంటున్న రైతులు

**గొల్లపల్లి మండలంలో సాగునీటి సమస్య మొదలైంది. చిల్వకోడూర్, దట్నూర్, అబ్బా పూర్‌లో నీరందక పంటల పరిస్థితి ప్రశ్నార్థకంగా మారుతున్నది. కేసీఆర్ పాలనలో పదేళ్ల పాటు ఏ బాధా లేకుండా సాగు చేసుకున్న రైతాంగం, ఇప్పుడు ఎండుతున్న పంటలను చూసి కన్నీరు పెడుతున్నది. ప్రస్తుత కాంగ్రెస్ సర్కారు పట్టించుకోకపోవడం వల్లే ఈ దుస్థితి వచ్చిందని మండిపడుతున్నది.**

గొల్లపల్లి, మార్చి 17 : గొల్లపల్లి మండలంలో సాగునీటి కటకట మొదలైంది. ముఖ్యంగా చిల్వకోడూర్ వాగును నమ్ముకొని పంటలు సాగు చేసిన చిల్వకోడూర్, దట్నూర్, అబ్బాపూర్‌లోని సుమారు 150 మంది రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. ఈ మూడు గ్రామాల వాగొడ్డు రైతులు ఏటా 400 ఎకరాల్లో వరి పండిస్తున్నారు. ఎస్సారెస్పీ నుంచి వారబంధీ పద్ధతిన విడుదలయ్యే నీరు రంగధామునిపల్లి రిజర్వాయర్‌లోకి చేరి మత్తడి దూకితే చిల్వకోడూర్ వాగు ప్రవహిస్తుంది. ఆ జలాలే వీరికి ఆధారం. వాగు నీటి ప్రవాహానికి కరెంట్ మోటర్లు పెట్టుకుని సాగు చేస్తుంటారు. ఇలా పదేండ్లుగా ఏ బాధా లేకుండా పంటలు పండించుకున్నారు. ఈ యాసంగిలోనూ అలానే నీళ్లు వస్తాయని భావించి పంటలు వేసుకున్నారు. కానీ, ఎస్సారెస్పీ నుంచి వారబంధీ పద్ధతిన నీరు సక్రమంగా రాకపోవడంతో రంగధామునిపల్లి రిజర్వాయర్ నిండలేదు. అలుగుపారలేదు. దీంతో వాగులో చుక్క నీరు లేక రైతులు అరిగోసపడుతున్నారు. పంటలు చేతికందే దశలో ఉన్నాయని, మరో నాలుగు తడులు అందితేనే దక్కుతాయని, లేదంటే ఎండిపోవడం ఖాయమని వాపోతున్నారు. ఇప్పటికే చాలా వరకు పొలాలు నెర్రెలు బారాయని, మరో పదిరోజులు నీరందకుంటే పశువుల మేతకు వదిలేయాల్సి వస్తుందని ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా స్థానిక ఎమ్మెల్యే, అధికారులు స్పందించి రంగధామునిపల్లి రిజర్వాయర్‌ను పూర్తిస్థాయిలో నింపి, నీరందించాలని వేడుకుంటున్నారు.


చిల్వాకోడూర్‌లో నీరందక నెర్రెలు బారిన వారిన వరిపొలం

### అలుగు పారితేనే నీరు

ఎస్సారెస్పీ డిస్ట్రిబ్యూటరీ-83 నుంచి వచ్చే నీటితోనే రంగధామునిపల్లి రిజర్వాయర్ నిండుతుంది. 12 ఫీట్ల ఎత్తుకు నీటినిల్వ చేరితే అలుగుపారి చిల్వకోడూర్ వాగు ప్రవహిస్తుంది. ప్రస్తుతం 4 ఫీట్ల మేర మాత్రమే నీరు ఉన్నది. దీంతో అలుగు పారే పరిస్థితి లేదు. గత వారం విడుదలైన నీటిని ఇతర ప్రాంతానికి తరలించడంతో రిజర్వాయర్ నిండలేదు. వారబంధీ కింద మరో రెండు తడులు వచ్చే అవకాశమున్నది. అయితే, ఆ తడులు ఎప్పుడు వస్తాయో..? అప్పటి వరకు పంటలు ఉంటాయో.. పోతాయో..? తెలియక రైతుల్లో ఆందోళన కనిపిస్తున్నది.


మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీఆర్

# సంజయ్.. చేసిందేంటో చెప్పు?

- చేతగాకనే రాముడి పేరుతో రాజకీయాలు
- ప్రజలు ఆలోచించి ఓటేయాలి
- ప్రగతి కాముకుడు వినోద్‌ను గెలిపించుకోవాలి
- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు

మానకొండూర్, మార్చి 17: ''కరీంనగర్ ఎంపీగా ఐదేండ్లు పదవి వెలగబెట్టిన బండి సంజయ్ చేసిందేంటో చెప్పు..? తెచ్చిన నిధులెన్నో చెప్పు? ఇది చేతగాకనే రాముడి పేరుతో రాజకీయాలు చేస్తున్నవు..'' అంటూ బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు ఫైర్ అయ్యారు. పాదయాత్రలు ఆయనకు ఏటీఎంల లాంటివని.. వీటి పేరుతో రూ.కోట్లు దండుకుంటున్నాడని తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఆదివారం మానకొండూర్ గడిమ హాల్‌లో విలేకరులతో మాట్లాడారు. సంజయ్‌కి దమ్ము, ధైర్యం ఉంటే దేవుడు, మతం పేరుతో కాకుండా చేసిన అభివృద్ధిని చెప్పి ఓట్లడగాలని సవాల్ విసిరారు. మాజీ ఎంపీ వినోద్ హయాంలోనే కరీంనగర్ నియోజకవర్గం అభివృద్ధి చెందిందన్నారు. స్మార్ట్ సిటీని సాధించి రూ.వెయ్యి కోట్లు తెచ్చారని చెప్పారు. కేబుల్ బ్రిడ్జి, మానేరు రివర్ ఫ్రంట్, జ్యోతిబాపూలే గ్రౌండ్‌లో సింథటిక్ ట్రాక్, టీటీడీ ఆలయం, ఇస్కాన్ టెంపుల్, ఐటీ టవర్స్, అంబేద్కర్ స్టడీ సర్కిల్.. ఇలా అనేక ప్రాజెక్టులను సాధించిన ఘనత వినోద్‌కే దక్కిందన్నారు. సంజయ్.. ప్రజాహిత యాత్రలో ప్రజలు, రైతుల సమస్యలపై కాకుండా మతంపేరుతో యువకులను రెచ్చగొడుతున్నాడని ఆక్షేపించారు. ప్రజా సమస్యలపై సీఎం రేవంత్‌రెడ్డిని నిలదీసే దమ్ముందా? అని ప్రశ్నించారు. ఎందుకంటే బీజేపీ, కాంగ్రెస్ మిలాఖత్ అయ్యాయని ఆరోపించారు. యాదాద్రిని అద్భుతంగా నిర్మించి, అనేక ఆలయాలకు విరివిగా నిధులిచ్చిన తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ ఏనాడూ మతాన్ని అడ్డం పెట్టుకొని రాజకీయాలు చేయలేదన్నారు. కానీ, సంజయ్‌ను ప్రజలు విశ్వసించనందునే దేవుళ్ల పేరుతో ఓట్లడుగుతున్నాడని దుయ్యబట్టారు. ప్రజలు ఆలోచించాలని.. ఒక్కసారి పొరపాటు చేస్తే ఐదేండ్లు ఆగం కావాల్సి వస్తుందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో ప్రగతి కాముకుడైన వినోద్‌ను అఖండ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో జడ్పీటీసీ తాళ్లపెల్లి శేఖర్‌గౌడ్, మాజీ సర్పంచులు రామంచ గోపాల్‌రెడ్డి, దేవ సతీశ్‌రెడ్డి, నాయకులు శాతరాజు యాదగిరి, పిట్టల మధు, నెల్లి శంకర్, దండబోయిన శేఖర్, బోడ రాజశేఖర్, ఇస్కుల్ల అంజనేయులు, వెంకటస్వామి, పిండి సందీప్ పాల్గొన్నారు.

# అన్నదాతకు కడగండ్లు

- అకాలవర్షం.. అపారనష్టం
- ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో దెబ్బతిన్న పంటలు
- రాజన్న సిరిసిల్లలో అత్యధికం
- ఆందోళనలో రైతులు


మానకొండూర్ రూరల్: నేలరాలిన మామిడి కాయలు

రాజన్న సిరిసిల్ల, మార్చి 17 (నమస్తే తెలంగాణ): అకాల వర్షం రైతన్నకు తీరని నష్టాన్ని తెచ్చింది. శనివారం రాత్రి కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో గాలివాన బీభత్సం సృష్టించింది. దాదాపు రెండు గంటలపాటు ఈదురుగాలులతో కూడిన వడగళ్ల వాన అతలాకుతలం చేసింది. ముఖ్యంగా మూడు నాలుగు మండలాల్లో వరి, మక్క, కూరగాయల తోటలు దెబ్బతినగా, మామిడి పిందెలు నేలరాలాయి. రైతన్న ఆశలను ముంచాయి.

### సిరిసిల్లలో అత్యధికంగా పంట నష్టం

రాజన్న సిరిసిల్ల జిల్లాలో వడగడ్ల వర్షం అన్నదాతలను నిండా ముంచింది. ప్రాథమికంగా అందిన సమాచారం మేరకు 500 ఎకరాల నష్టం జరిగినట్లు తెలుస్తున్నది. జిల్లా వ్యాప్తంగా 13 మండలాల్లో 1.83లక్షల ఎకరాల్లో యాసంగి పంటలు సాగు చేశారు. అందులో వరి 1,73,100, మక్క 1014, నువ్వులు 240 ఎకరాలు, పొద్దుతిరుగుడు 303, శనగ 392, ఆయిల్‌ఫాం 687, కూరగాయలు 550, పండ్లతోటలు 5,467, ఉద్యాన పంటలు 6,317ఎకరాలలో సాగు చేశారు. మరో పదిహేను రోజుల్లో పంట చేతికొస్తుందనుకుంటే వడగళ్ల వర్షం రైతులపై పగబట్టింది. శనివారం రాత్రి పెద్ద పెద్ద రాళ్లతో కూడిన వర్షం పంటలను ధ్వంసం చేసింది. గంభీరావుపేట, ముస్తాబాద్, వీర్నపల్లి, సిరిసిల్ల పట్టణంలో భారీ వర్షం కురిసింది. రెండు గంటల పాటు ఏకధాటిగా కురిసిన వర్షానికి భారీగా పంట నష్టం జరిగింది. వ్యవసాయ శాఖ ప్రాథమిక అంచనాల ప్రకారం జిల్లాలో 500 ఎకరాల్లో వరి పంట నష్టం జరిగినట్లు అధికారులు తెలిపారు. అత్యధికంగా అందులో గంభీరావుపేట మండలంలోనే ఎక్కువ జరిగింది. ఇప్పటి వరకు తెలిసిన సమాచారం ప్రకారం 350 ఎకరాల వరి నష్టం జరిగినట్లు చెబుతుండగా, వందలాది ఎకరాల వరి, మామిడి తోటలు నష్టం జరిగే అవకాశం ఉందని తెలుస్తున్నది. ఇక వీర్నపల్లి మండలంలో 58, ముస్తాబాద్ మండలంలో 28 ఎకరాల్లో వరి నష్టం జరిగినట్లు ప్రాథమిక అంచనా వేసింది. ఇంకా వ్యవసాయ శాఖ ఇంకా సర్వే జరుపుతున్నది. గంభీరావుపేట మండలంలో దాదాపు 400 మంది రైతులకు సంబంధించి వెయ్యి ఎకరాల వరకు నష్టం జరిగినట్లు రైతులు తెలిపారు. వీర్నపల్లి మండల కేంద్రంతో పాటు వనపల్లి, శాంతినగర్, లాల్‌సింగ్ తండా, రంగంపేట, గ్రామాల్లో వరి దెబ్బతిన్నది. మామిడి తోటలు నేలమట్టమయ్యాయి. ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.


మానకొండూర్ రూరల్: కొండపల్కలలో నేల కొరిగిన వరి పంట

### కరీంనగర్‌లో ప్రభావం

అకాలవాన, వడగండ్లతో కరీంనగర్ జిల్లా వీణవంక మండలం ఎలుబాక, కిష్టంపేట గ్రామాల్లో వరి దెబ్బతిన్నది. ఎలుబాకలో పిల్లి రవియాదవ్, రొండ్ల రాజకొమురయ్య, ముదం రవీందర్, నూగిల్ల శంకర్, మాడ తిరుపతిరెడ్డి, తెడ్ల శంకర్, మడికొండ ఎల్లయ్యకు చెందిన 15 ఎకరాల వరిపంట, 5 ఎకరాల మక్క నేలకొరిగింది. మానకొండూర్ మండలం కొండపల్కల, గంగిపల్లి, మద్దికుంట, చెంజర్ల, ముంజంపల్లి పలు గ్రామాల్లో వరి పంట, మామిడి తోటలు దెబ్బతిన్నాయి. కొండపల్కలలో దాదాపు 20 ఎకరాల మేర వరి పైరు నేలకొరిగింది.


వీర్నపల్లి మండలం వన్‌పల్లిలో దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న రెవెన్యూ అధికారులు

## కొత్త ఓటర్ల నమోదుకు అవకాశం

### కరీంనగర్ జిల్లా ఎన్నికల అధికారి పమేలా సత్పతి

కరీంనగర్ కలెక్టరేట్, మార్చి 17 : సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో కొత్త ఓటర్ల నమోదుకోసం ఏప్రిల్ 15 వరకు ఎన్నికల సంఘం అవకాశం కల్పించినట్లు కరీంనగర్ జిల్లా ఎన్నికల అధికారి పమేలా సత్పతి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 18 ఏండ్లు నిండి, ఇప్పటి వరకు ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోని వారంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. అలాగే, ఓటరు జాబితాలో తప్పొప్పులు సరిచేసుకోవడం, ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారు ప్రస్తుతం నివాసమున్న చోట ఓటు నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రతి మూడు నెలలకొకసారి ఓటరు నమోదు ప్రక్రియ నిరంతరాయంగా కొనసాగుతుందని, జనవరి, ఏప్రిల్, జూలై, అక్టోబర్ నెల ఒకటో తేదీ నాటికి 18 ఏండ్లు నిండిన వారంతా ఓటు కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఎన్నికల సంఘం ఇటీవల విడుదల చేసిన తుది జాబితాలో తమ పేర్లు లేనివారు తిరిగి నమోదు చేసుకోవచ్చని, ఇందుకోసం ఫాం-8 దరఖాస్తును ఆన్‌లైన్‌లో కానీ, నియోజకవర్గ ఎన్నికల అధికారి, సహాయ ఎన్నికల అధికారి, బూత్‌స్థాయి అధికారికి ప్రత్యక్షంగా లేదా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని సూచించారు. https:\\nvsp.in, https:\\ceotelangana.nic.in, https:\\voters.eci.gov.in అనే వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవచ్చని స్పష్టం చేశారు.

# విజయోస్తు!



## నేటి నుంచే పదో తరగతి పరీక్షలు

- హాజరుకానున్న రాయనున్న 38,097 మంది విద్యార్థులు
- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 219 పరీక్ష కేంద్రాలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

జగిత్యాల టౌన్, మార్చి 17: 'పది' పబ్లిక్ పరీక్షలకు సర్వం సిద్ధమైంది. నేటి నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకు జరుగనున్న ఎగ్జామ్స్‌కు అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది. ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా 219 సెంటర్లు ఏర్పాటు చేయగా, మొత్తం 38,097 మంది పరీక్షలు రాయనున్నారు. ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు పరీక్షా సమయం కాగా, గంట ముందే చేరుకోవాలని విద్యాశాఖ అధికారులు సూచిస్తున్నారు. కాగా, పరీక్షల నిర్వహణలో ఎలాంటి అవకతవకలు, లోపాలు లేకుండా ఉండేందుకు ఉన్నతాధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు. విద్యార్థులు ఒత్తిడిని అధిగమిస్తే.. విజయం తథ్యమని పలు సూచనలు చేస్తూనే, మాస్ కాపీయింగ్‌కు పాల్పడినా, ప్రోత్సహించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

**పదో తరగతి పరీక్ష రాసే విద్యార్థులు, సెంటర్లు జిల్లాల వారీగా**

| జిల్లా | కేంద్రాలు | బాలురు | బాలికలు | మొత్తం |
|---|---|---|---|---|
| కరీంనగర్ | 75 | 6,655 | 5,874 | 12,529 |
| జగిత్యాల | 67 | 5,602 | 5,763 | 11,365 |
| పెద్దపల్లి | 45 | 3,883 | 3,845 | 7,728 |
| సిరిసిల్ల | 35 | 3080 | 3395 | 6,475 |
| మొత్తం | 219 | 19,220 | 18,877 | 38,097 |


ధర్మారం: నంది మేడారంలోని జడ్పీ హైస్కూల్‌లో హాల్ టికెట్ నంబర్లు వేస్తున్న సిబ్బంది


క్యూలైన్లలో భక్తులు

# రాజన్న ఆలయంలో రద్దీ

వేములవాడ టౌన్, మార్చి 17: వేములవాడ రాజన్న ఆలయం ఆదివారం భక్తులతో రద్దీగా కనిపించింది. రాజన్నను ఎనిమిది వేలకు పైగా భక్తులు దర్శించుకోగా, రూ.9లక్షలకు పైగా ఆదాయం సమకూరిందని ఆలయ అధికారులు వెల్లడించారు. కాగా, స్వామివారిని జిల్లా అసిస్టెంట్ సెషన్ జడ్జి శ్రీలేఖ, రాష్ట్ర దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమశాఖ సంచాలకుడు బొడ్డ శైలజ దర్శించుకున్నారు.

# పార్లమెంట్ ఎన్నికలకు పటిష్ట భద్రత

### రామగుండం సీపీ శ్రీనివాసులు


మాట్లాడుతున్న సీపీ

ఫర్టిలైజర్‌సిటీ, మార్చి 17: పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు పటిష్టమైన భద్రత చర్యలు చేపట్టాలని రామగుండం సీపీ శ్రీనివాసులు నిర్దేశించారు. శనివారం రామగుండం కమిషనరేట్‌లో పోలీసు అధికారులకు మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ సమస్యాత్మక కేంద్రాలను గుర్తించి ప్రత్యేక భద్రత ఏర్పాట్లు చేయాలన్నారు. నేర చరిత్ర ఉన్నవారు, రౌడీషీటర్లను రెవెన్యూ అధికారుల ఎదుట బైండోవర్ చేయాలని సూచించారు. ప్రలోభాలకు లొంగకుండా విధులు నిర్వర్తించాలని కోరారు. పోలీసు అధికారులకు వారం పాటు శిక్షణ ఉంటుందని, తర్వాత ఏఎస్ఐ, హెడ్‌కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లకు సైతం ఎన్నికల కోడ్‌పై అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు. ఇక్కడ కమిషనరేట్ పరిధిలోని పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల ఏసీపీలు, సీఐలు, ఎలక్షన్ సెల్ సీఐ, ఎస్ఐలు ఉన్నారు.

BEST OF LUCK
సాజిత్ థామస్
కరస్పాండెంట్
నలంద ఇ/మీ హైస్కూల్
వాణినగర్, జగిత్యాల.

విజయీ భవ-దిగ్విజయీ భవ
SSC పరీక్షలు వ్రాస్తున్న విద్యార్థిని, విద్యార్థులు మంచి ఉత్తీర్ణతతో విజయకేతనం ఎగరవేసి జిల్లాను ప్రథమ స్థానంలో ఉంచాలని ఆకాంక్షిస్తూ...
కొట్టాల గంగారెడ్డి, కరస్పాండెంట్
శ్రీ సాయి చైతన్య హైస్కూల్ ఇ/మీ
సాయిరాం కాలనీ, మెట్‌పల్లి
IIT & NEET FOUNDATION NURSERY TO X CLASS